క్లుప్తంగా

ఘనంగా రణఅంకమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజిగూడెంలో నాయీబ్రాహ్మణ వీధిలో వేం చేసి ఉన్న శ్రీశ్రీశ్రీరణఅంకమ్మతల్లి ఆలయ వార్షిక వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. దేవస్థానం పునఃనిర్మాణం జరిపి 17 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. తొలుత అమ్మవారికి విశేష అలంకరణ జరిపి పాలపొంగళ్లను సమర్పించారు. భారీగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ నేతృత్వంలో రెండు వేల మంది భక్తులకు అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, నాయీబ్రాహ్మణ సంఘ ప్రముఖులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



పెనమలూరు: వైఎస్సార్ కాంగ్రెస్ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి, కృష్ణా, బాపట్ల జిల్లాల మహిళా విభాగం ఇన్‌చార్జి పేరం త్రివేణిరెడ్డి బుధవారం కానూరుకు వచ్చారు. ఆమె వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవభక్తుని చక్రవర్తి పార్టీ కార్యాయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా మహిళా విభాగం పటిష్టతకు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. కృష్ణా జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శీలం భారతి నాగకుసుమరాణి కూడా కానూరు పార్టీ కార్యాలయంలో చక్రవర్తిని కలిశారు.

సచివాలయ ఉద్యోగి ఘటనపై విచారణ

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో టీడీపీ నేతల వేధింపుల కారణంగా ఆత్మహత్యయత్నానికి యత్నించిన సచివాలయ ఉద్యోగిని ఘటనపై తాడిగడప మున్సిపాలిటీ అధికారులు విచారణ చేపట్టారు. విచారణ అధికారి డెప్యూటీ ఈఈ జి.పుల్లారావు ఘటనపై విచారణ ప్రారంభించారు. ఆయన ఇద్దరు టీడీపీ నేతల వద్ద గొడవకు జరిగిన కారణాల వివరాలు తీసుకున్నారు. అలాగే సచివాలయం – 2 ఇంజినీరింగ్ అసిస్టెంట్ తనూజ, ఎలక్ట్రిషియన్ కోటేశ్వరరావుకు విచారణ అధికారి పుల్లారావు నోటీసులు ఇచ్చారు. ఘటనకు సంబంధించిన వివరాలు రాతపూర్వకంగా ఇవ్వాలని ఆదేశించారు. కాగా సచివాలయ ఉద్యోగిని టీడీపీ నేతలు మరలా బెదిరిస్తుండటంతో ఆమె కుటుంబ సభ్యులు కమిషనర్ నజీర్‌ను ఆశ్రయించారు. ఈ విచారణలో అధికారులు ఏమి తేల్చుతారనేది వేచి చూడాలి.

స్వచ్ఛ సుందర గ్రామంగా ఆత్కూరును తీర్చిదిద్దాలి



ఆత్కూరు(గన్నవరం): మండలంలోని ఆత్కూరు గ్రామంలో బుధవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రజారోగ్య పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి భూతపాటి ఎస్తేరమ్మ, డెప్యూటీ ఎంపీడీఓ వి.దిలీప్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు ఇంటింటికి వెళ్లి వ్యర్థాల నిర్వాహణపై అవగాహన కల్పించారు. ప్రతి రోజు తడి, పొడి చెత్తను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్‌కు అప్పగించాలని సూచించారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. స్వచ్ఛ సుందర గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.అప్పారావు, జూనియర్ అసిస్టెంట్ జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వివాహిత మృతి

పెనమలూరు: భార్యాభర్తల తగాదా కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత మృతి చెందిన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు వినాయక్‌నగర్‌కు చెందిన కట్టిడి మల్లేశ్వరి(38) భర్త రాఘవులుతో కలిసి నివాసం ఉంటున్నారు. భర్త ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కాగా దంపతులకు ఈ నెల 13వ తేదీన ఇంటి అద్దె విషయమై గొడవపడ్డారు. దీంతో మల్లేశ్వరి ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను వెంటనే విజయవాడలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉధృతంగా కృష్ణమ్మ పరవళ్లు

- కరకట్ట వైపు చొచ్చుకువస్తున్న వరదనీరు
- లంక భూములకు పొంచి ఉన్న ముంపు భయం
- ఆందోళనలో రైతులు



మద్దూరు వద్ద ఏటిపాయలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు



నీట మునిగిన కాసరనేనివారిపాలెం శివాలయం

కంకిపాడు: కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరదనీరు ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు విడుదల అవుతోంది. దీంతో కృష్ణానది ఏటిపాయ నిండుకుండలా ప్రవహిస్తోంది. ఏటిపాయలో వరదనీరు పరవళ్లు తొక్కుతోంది. నీటి ఉధృతి 4.80 లక్షలు చేరటంతో ఏటిపాయ వెంబడి సాగులో ఉన్న పంట పొలాలకు ముంపు భయం పొంచి ఉంది. దీంతో అన్నదాతలు పంటలపై ఆందోళన చెందుతున్నారు.

మూడు మండలాల పరిధిలో ప్రవాహం..

పెనమలూరు, కంకిపాడు, తోట్లవల్లూరు మండలాల పరిధి గుండా కృష్ణానది ఏటిపాయ ప్రవహిస్తోంది. ప్రస్తుతం కరకట్ట వైపునకు వరదనీరు చొచ్చుకువస్తోంది. కాసరనేనివారిపాలెం వద్ద శివాలయం మరోసారి నీట మునిగింది. మత్స్యకారులు వరదనీటి ప్రవాహాన్ని ముందస్తుగానే అంచనా వేసి ఏటిలో ఉన్న పడవలు, వలలను ఒడ్డుకు చేర్చుకుని భద్రపర్చుకున్నారు. తోట్లవల్లూరు మండల పరిధిలోని రొయ్యూరు శివారు తోడేళ్ల దిబ్బ లంక, వల్లూరుపాలెం శివారు కాళింగ దిబ్బ లంక, పాములలంక శివారు తుమ్మలపచ్చిక లంక, చాగంటిపాడు శివారు పిల్లివాని లంక, దేవరపల్లి శివారు పొట్టిదిబ్బలంక, ఐలూరు శివారు కనిగిరి లంక, ములకలపల్లి లంక గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో సుమారు 3,500 మందికి పైగా జనాభా నివాసం ఉంటున్నారు. కొద్దిపాటి వరదకే లంక గ్రామాల చుట్టూ వరదనీరు చేరుతుంది. పాయలో ఉన్న రహదారులు ధ్వంసమవ్వటంతో ఇక్కడి ప్రజలు రాకపోకలకు పడవలను ఆశ్రయిస్తున్నారు. పంట ఉత్పత్తులను సైతం పడవల్లో ఒడ్డుకు చేర్చి మార్కెట్‌కు తరలిస్తున్నారు.

అన్నదాతల్లో కలవరం..

వరద ఉధృతి పెరుగుతుండటంతో రైతుల్లో కలవరం మొదలైంది. కరకట్ట ఆనుకుని ఉన్న లంక భూములకు ముంపు భయం పొంచి ఉంది. తోట్లవల్లూరు పరిధిలోని లంక గ్రామాల పరిధిలో అయితే 8 వేల ఎకరాల్లో వివిధ రకాల వాణిజ్య పంటలు, కూరగాయల సాగు జరుగుతుంది. ఇప్పటికే వెయ్యి ఎకరాలకు పైగా విస్తీర్ణంలో పసుపు, కంద, కూరగాయలు, చెరకు ఇతర పంట పొలాల్లోకి నీరు చేరిందని రైతులు చెబుతున్నారు. నీటి ఉధృతి మరింత పెరిగితే పంట పొలాలకు భారీగా నష్టం జరుగుతుందని అన్నదాతలు వాపోతున్నారు.

వరద ముంపులో పెదపులిపాక కాలనీ

పెనమలూరు: కృష్ణానది వరద నీరు పెదపులిపాక గ్రామంలో పలు ఇళ్ల వద్దకు చేరుకుంది. నది ఒడ్డున ఉన్న ఇళ్లు పూర్తిగా వరద నీటిలో మునిగిపోయింది. వరద ప్రమాదకరంగా ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అయితే బుధవారం మధ్యాహ్నం వరద కొద్దిగా తగ్గు ముఖం పట్టడటంతో ఊపిరి పీల్చుకున్నారు. కృష్ణానది వరద ఉధృతి పెరగటంతో కరకట్ట దిగువున ఉన్న నివాసితులు చాలా ఆందోళనకు గురయ్యారు. ఒక దశలో వరద 4.90 లక్షల క్యూసెక్కులకు చేరుకోవటంతో నివాసితులు భయాందోళనకు లోనయ్యారు. పెదపులిపాక ఎన్టీఆర్ నగర్ పల్లపు ప్రాంతంలో కృష్ణానది వరద కట్టపైకి చేరుకుంది. అక్కడ ఉన్న ఇల్లు మునిగిపోయింది. పొలాల్లోకి నీరు చేరుకుంది. వరద పెరుగుతుందని స్థానికులు నివాసాలు వదిలి బయటకు వచ్చారు. అయితే మధ్యాహ్నం వరద తగ్గుముఖం పట్టడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నదికి వరద వచ్చినప్పుడల్లా కరకట్ట దిగువున ఉన్న నివాసితుల పరిస్థితి ఆందోళనకరంగా ఉంటుంది.



పెదపులిపాక ఎన్టీఆర్ నగర్‌లో నీట మునిగిన ఇల్లు



కృష్ణానదిని పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

వరద ప్రాంతాన్నిపరిశీలించిన తహసీల్దార్

పెనమలూరు: కృష్ణానదికి వరదల కారణంగా వరద ప్రభావ ప్రాంతాలను తహసీల్దార్ గోపాలకృష్ణ బుధవారం సందర్శించారు. ఆయన పెదపులిపాక, యనమలకుదురు, చోడవరం ప్రాంతాల్లో పర్యటించి వరద వస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెవెన్యూ యంత్రాంగం కూడా ఎప్పటికప్పుడు పరిస్థితులు పరిశీలించి జాగ్రత్తగా ఉండాలని ఆదేశించారు. నదీ పరివాహక ప్రాంతంలో ఎవరూ తిరగరాదని సూచించారు.

స్వామిత్వ పథకంపై అవగాహన సదస్సు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని నివేశన స్థలాలు, ఇళ్లకు సంబంధించిన భూమి హద్దులు, రికార్డులపై సమగ్ర సర్వే నిర్వహించి, ఆస్తి యాజమానులకు చట్టబద్ధమైన హక్కు రికార్డులను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం స్వామిత్వ పథకాన్ని ప్రవేశపెట్టిందని నాగార్జున సాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు అన్నారు. బాపులపాడు మండలం రంగన్నగూడెంలో స్వామిత్వ పథకంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంతో కాలంగా స్థిరనివాసం ఉంటున్నప్పటికీ ఎలాంటి చట్టబద్ధమైన హక్కు పత్రాలు లేని గృహ యాజమానులకు ఈ పథకం ఎంతో లబ్ధి చేకూర్చుతుందని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణకాంత్ మాట్లాడుతూ బ్రిటీష్‌కాలం నుంచి వ్యవసాయ భూమికి రికార్డులు నిర్వహించబడుతున్నప్పటికీ, ఇళ్ల యాజమాన్య రికార్డులు నమోదు చేయలేదన్నారు. దీని కోసం స్వామిత్వ పథకం ద్వారా రెవెన్యూ, సర్వే, పంచాయతీరాజ్ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రతి స్థిరాస్థి హక్కులు గుర్తించి, ప్రభుత్వం ద్వారా ఆస్తి యాజమానులకు హక్కు రికార్డులు పంపిణీ చేస్తారని చెప్పారు. సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ సభ్యుడు పుసులూరి లక్ష్మీనారాయణ, సర్వేయర్ తిరుపతయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్యామల, వెల్ఫేర్ అసిస్టెంట్ రామకృష్ణ, గ్రామ ప్రముఖులు మొవ్వా వేణుగోపాల్, తుమ్మల దశరథరామయ్య, కనకవల్లి శేషగిరిరావు పాల్గొన్నారు.

స్త్రీయరక్షణపై అవగాహన

పటమట(విజయవాడతూర్పు): బాలికలు, మహిళల చట్టాలపై అందరూ అవగాహన ఉండాలని, శక్తి యాప్ ద్వారా ఆపద సమయాల్లో రక్షణ పొందవచ్చని శక్తి బృందం సభ్యులు అన్నారు. బుధవారం నగరంలోని వివిధ కళాశాలలు, విద్యా సంస్థల్లో మహిళ చట్టాలు, స్వీయ రక్షణ బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

అడుగడుగునా ఆక్రమణలు!



కంకిపాడు లాకులు వద్ద రోడ్డు మార్జిన్‌లో నిర్మించిన దుకాణాలు



కంకిపాడులో డ్రెయినేజీపై శ్లాబు ఏర్పాటుచేసి దుకాణ నిర్వహణ

- యథేచ్ఛగా డ్రెయినేజీలపై వ్యాపార సముదాయాల ఏర్పాటు
- పంట బోదెలను ఆక్రమించి దుకాణాల నిర్మాణం
- రోడ్డు మార్జిన్‌లనూ వదలని వైనం
- చోద్యం చూస్తున్న అధికారులు

కంకిపాడు: అడుగడుగునా ఆక్రమణలు...రోడ్డు మార్జిన్‌లు...డ్రెయినేజీలు.. పంటబోదెలు, డ్రెయినేజీ బోదెలు...దేన్నీ వదలటం లేదు. అధికార పక్షం అండదండలతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. అడ్డగోలుగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. రోడ్డు మార్జిన్లను ఆక్రమించి అద్దెలకు ఇచ్చుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. వివరాల్లోకి వెళితే...

ప్రజలకు తప్పని ఇబ్బందులు..

మండల కేంద్రమైన కంకిపాడు ప్రస్తుతం ఆక్రమణలకు అడ్డాగా మారింది. విజయవాడ – మచిలీపట్నం రహదారి వెంబడి మార్జిన్లను సమీప నివాసితులు, దుకాణదారులు ఆక్రమించేస్తున్నారు. ఆక్రమించిన స్థలంలో చిన్న చిన్న దుకాణాలు, తోపుడు బండ్లు, చిరు వ్యాపారులకు అద్దెలకు ఇచ్చి జేబులు నింపుకుంటున్నారు. రోడ్డు మార్జిన్లు ఆక్రమణలకు గురవుతుండటంతో ఈ మార్గంలో ప్రయాణం అంటేనే వాహనదారులు భయాందోళనలు చెందుతున్నారు. రోడ్డు మార్జిన్లలో లారీల అనధికార పార్కింగ్ చేసి ఎగుమతులు, దిగుమతులు చేస్తుండటమే ఇందుకు ప్రధాన కారణం. అనధికార పార్కింగ్‌లు, ప్రజలు పడుతున్న ఇబ్బందులపై పోలీసు శాఖ స్పందించటం లేదంటూ పలువురు విమర్శిస్తున్నారు.



కంకిపాడు సబ్‌స్టేషన్ ఎదురుగా డ్రెయిన్‌పై ఏర్పాటుచేసిన దుకాణం

పూడికలకు నోచుకోని వైనం..

కంకిపాడు పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంటోంది. శిథిలమైన డ్రెయినేజీ వ్యవస్థ కారణంగా మురుగు పారుదల కాక ప్రజలు దోమలతో సహవాసం చేస్తూ నరకం చూస్తున్నారు. ఇది చాలదన్నట్లు కొందరు వ్యాపారులు డ్రెయిన్లను శాశ్వతంగా ఆక్రమించేస్తూ శ్లాబులు నిర్మిస్తున్నారు. దీంతో పూడికతీత పనులు సాగే ఆస్కారం లేకుండా పోతుంది. డ్రెయిన్లు ఆక్రమణకు గురవుతున్నా పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

ఆక్రమణకు అడ్డు లేదు

డ్రెయిన్లు, పంట బోదెలు, డ్రెయినేజీ బోదెల వెంబడి దుకాణదారులు ఆయా డ్రెయిన్లు, బోదెలపై శ్లాబులు నిర్మించి దుకాణాలను విస్తరిస్తున్నారు. ఈ తంతు పట్టణంలోని నలుమూలల సాగుతోంది. కంకిపాడు లాకులు పరిసరాల్లో కొందరు రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించుకుని దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. అధికారపక్షం అండదండలతో ఆక్రమణలు అడ్డూ అదుపూ లేకుండా సాగుతున్నాయన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్ అధికారులు ఏ ఒక్కరూ ఆక్రమణలపై నోరుమెదపటం లేదు. అడ్డగోలుగా ఆక్రమణలు సాగిపోతున్నా పట్టించుకోవటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వరిలో మేలైన యాజమాన్య పద్ధతులు చేపట్టాలి

కంకిపాడు: వర్షాలకు రైతులు వరి పంటలో మేలైన యాజమాన్య పద్ధతులు చేపట్టాలని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి సూచించారు. కంకిపాడు, పునాదిపాడు గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలను శాస్త్రవేత్తల బృందం, అధికారులు, రైతులతో కలిసి బుధవారం సందర్శించారు. డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ సాధారణ రకాలు పిలకల దశలో ఐదు రోజులు వరకూ నీట మునిగినా బతికే అవకాశం ఉంటుందన్నారు. పిలకల దశలో వరి నీట మునిగితే నీటిని బయటకు తీసిన తరువాత ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోలు పొటాష్ అదనంగా వేసుకోవాలన్నారు. బూస్టర్ డోస్ వేయటం వల్ల ముంపు ప్రభావం నుంచి త్వరగా పంట కోలుకుంటుందని చెప్పారు. కుళ్లు తెగులు రాకుండా లీటరు నీటికి 1 గ్రాముల కార్బండిజం లేదా 2 గ్రాములు కార్బండిజం, మాంకోజెబ్ కలిసిన మిశ్రమం పిచికారీ చేసుకోవాలన్నారు. పొడ తెగులు వ్యాప్తి చెందకుండా హెక్సాకొనజోల్ 2 మిల్లీలీటర్లు, లేదా వాలిడామైసిన్ 2 మిల్లీలీటర్లు లేదా అజాక్సిస్ట్రోబిన్ 1 మిల్లీలీటరు చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో చెరుకు పరిశోధనాస్థానం శాస్త్రవేత్త విజయ భాస్కర్‌రెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు రేవతి, నవీన్, వ్యవసాయాధికారి ఉషారాణి, వీఏఏలు పాల్గొన్నారు.



పునాదిపాడులో వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు, రైతుల బృందం



ముస్తాబాదలో వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ సునీల్, అధికారులు

ముస్తాబాదలో 'పొలం పిలుస్తోంది'

గన్నవరంరూరల్: రైతులు నానో యూరియాను పంటలకు పిచికారి చేయాలని గన్నవరం ఏడీఏ ఎం.సునీల్ సూచించారు. మండలంలోని ముస్తాబాద గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం డీడీఏ కె.జ్యోతి రమణి, ఏడీఏ కె.శ్రీనివాసరావులతో కలిసి ఆయన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. ఘన యూరియాను కొరత ఉన్న దృష్ట్యా నానో యూరియా ఎకరానికి అరలీటరు పిచికారీ చేయాలన్నారు. కలుపు, ఎరువులు, ఎలుకల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా వనరుల కేంద్రం ఏవో పద్మజ, రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

రైతులు నానో యూరియాను వినియోగించాలి

పెనమలూరు: రైతులు యూరియాకు బదులుగా నానో యూరియా వినియోగించాలని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ అన్నారు. ఆమె బుధవారం గంగూరు, యనమలకుదురు గ్రామాలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో నానో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు వాడాలని సూచించారు. కాగా రైతులు మాట్లాడుతూ తమకు యూరియా అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి యూరియా అందించాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత



రేడియంట్ హైస్కూల్ బాలోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో అమరావతి బాలోత్సవం ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీల విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం బుధవారం జరిగింది. నున్న గ్రామంలో రేడియంట్, షోఫి, సరస్వతి విద్యా నికేతన్ హైస్కూళ్లలో జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో బాలోత్సవం సాంస్కృతిక విభాగ కన్వీనర్ జి.వి.రంగారెడ్డి పాల్గొని విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. చిన్నారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు దశాబ్ద కాలంగా అమరావతి బాలోత్సవం నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను ఈ సందర్భంగా ఆయన సంక్షిప్తంగా వివరించారు. చిన్నతనం నుంచే విద్యార్థులు పోటీల్లో పాల్గొనడం వలన భవిష్యత్‌లో పోటీ తత్వం ఉన్నత చదువులకు దోహదం చేస్తుందన్నారు. వచ్చే ఏడాది బాలోత్సవం వార్షికోత్సవంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని రంగారెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో అవుతు మధుసూదన్ రెడ్డి, అనూరాధ, ఎస్కే నూర్జహాన్, కె.ఎస్తేర్ , సాంబశివరావు, దేవులపల్లి రవికుమార్, వేణుబాబు, హనుమంతరావు, సరోజ, మేరీ రత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు

గన్నవరం: జిల్లా స్థాయిలో మూడో సారి ఉత్తమ అధికారిగా ప్రశంసా పత్రం అందుకున్న జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి దేవరపల్లి విక్టర్‌బాబును మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్(ఎంఈఎఫ్) నేతలు ఘనంగా సత్కరించారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో విక్టర్‌బాబుకు సర్పంచి నిడమర్తి సౌజన్య, ఎంఈఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు, పలువురు నేతలు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తున్న విక్టర్‌బాబు మూడో సారి ఉత్తమ అధికారిగా ప్రశంసా పత్రం అందుకోవడం అభినందనీయమన్నారు. జిల్లా ఉపాధి కల్పన అధికారిగా ఆయన ఎంతో మంది యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పనకు కృషి చేశారని తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి.ఎలీషా, పీడీ వెంకటేశ్వరరావు, ఎంఈఎఫ్ నేతలు లాం కోటేశ్వరరావు, రాబర్ట్ జాన్సన్, బొకినాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.



విక్టర్‌బాబును సత్కరిస్తున్న ఎంఈఎఫ్ నేతలు

ప్రోస్టేట్ గ్రంథిపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణకిషోర్

విజయవాడరూరల్: నున్న గ్రామంలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో డాక్టర్ రెడ్డీస్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రోస్టేట్ గ్రంథిపై అవగాహనా సదస్సును బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఏవీ కృష్ణ కిషోర్ మాట్లాడుతూ.. ప్రోస్టేట్ గ్రంథి ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్యంగా పురుషుల్లో ప్రోస్టేట్ గ్రంథి పనితీరు, 50 సంవత్సరాల తరువాత ప్రోస్టేట్ గ్రంథిలో వచ్చే మార్పులు ఆరోగ్య సమస్యలను వివరించారు. ప్రోస్టేట్ గ్రంథిని ఆరోగ్యంగా ఎలా ఉంచుకోవాలి, మంచి ఆహారం తీసుకుని ఆరోగ్యపరంగా కాపాడుకునే విధానాలను తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ శ్రీనివాస్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పునాదిపాడులో ఆధార్ నమోదు శిబిరం



కంకిపాడు: మండలంలోని పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో ఆధార్ ప్రత్యేకనమోదు శిబిరం బుధవారం నిర్వహించారు. పాఠశాల విద్యార్థుల ఆధార్ నమోదు, అప్‌డేట్, ఇతర వివరాలను నమోదు చేశారు. శిబిరాన్ని ఎంపీడీఓ కార్యాలయ అధికారులు సందర్శించి పర్యవేక్షించారు. ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పి.అనూష కోరారు.

రేపు పేరంటాలమ్మకు గాజుల అలంకరణ

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ అమ్మవారికి శుక్రవారం గాజుల అలంకరణ నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.ప్రియాంక తెలిపారు. శ్రావణ మాసం సందర్భంగా అమ్మవారికి ప్రీతికరమైన గాజుల అలంకరణ చేస్తున్నామన్నారు. ఈ అలంకరణ నిమిత్తం అమ్మవారికి గాజులు సమర్పించే భక్తులు గురువారం ఉదయం 11 గంటల లోపు ఆలయంలో గాజులు అందజేయాలని సూచించారు. గాజుల అలంకరణ అనంతరం అమ్మవార్లకు పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పూజా కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఈవో కోరారు.